# సూర్య
www.suryaa.com

18వ వసంతంలోకి

## నల్గొండ-యాదాద్రి-సూర్యాపేట

శుక్రవారం 18, ఏప్రిల్ 2025 పేజీలు - 8


# పలు శుభకార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం



చిట్యాల, మేజర్‌న్యూస్ : చిట్యాల మండలంలోని తాళ్లవెళ్ళాంల గ్రామా నికి చెందిన పామనగుల్ల మారేష్ కుమారుడు వివాహానికి గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వ దించిన నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం. అనంతరం బొంగుని చెరువు గ్రామానికి చెందిన సామిడి ప్రభాకర్ రెడ్డి కుమారుడి జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సామిడి మోహన్ రెడ్డి, పిశాటి భీష్మారెడ్డి, అంతటి నరసింహ, ఏనుగు రఘుమారెడ్డి, సర్కంటి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూ భారతి

### - జూన్ 2 నుండి పారదర్శకంగా భూ భారతి చట్టం అమలు

### - నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి









చింతపల్లి, మేజర్‌న్యూస్ : రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూ భారతి చట్టమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా, దేవరకొండ రెవిన్యూ డివిజన్ పరిధిలోని చింత పల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం)-2025 పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. రైతులను ఉద్దే శించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూముల పై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా దొరుకుతుందని, జూన్ 2 నుండి ఆన్లైన్లో భూభారతి చట్టం పోర్టల్ పనిచేస్తుందన్నారు. భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు మీ -సేవలో లాగే దరఖాస్తు చేసుకోవచ్చుని, ఏదైనా సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేస్తే నిర్దేశించిన సమయంలో పరిష్కరించడం

మిగతా 2లో

# భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం

### - జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్



నేరేడుచర్ల, మేజర్‌న్యూస్ : భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్ఆర్ ఫ్రైడ్ ఫంక్షన్ హాల్‌లో భూ భారతి చట్టం 2025 పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున భూ భారతి చట్టం అమలులోకి తీసుకవచ్చి రాష్ట్ర, జిల్లా స్థాయిలో రెవిన్యూ సిబ్బందికి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రజలకు చట్టంపై అవగాహన తెచ్చేందుకు జిల్లాలోని 23 మండలాలలో భూ సమస్యలు ఎలా పరిష్కరించాలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధరణిలో సమస్యలు పరిష్కారం కాలేదని, ప్రతి సమస్య కలెక్టర్, కోర్టు ద్వారా పరిష్కరించే విధంగా ఉన్నాయన్నారు. గ్రామం నుండి జిల్లా కేంద్రానికి వచ్చి సమస్యపై దరఖాస్తు ఇవ్వాలంటే ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉండేదన్నారు. భూ భారతి చట్టం ద్వారా తహసీల్ధార్, ఆర్డీవో,కలెక్టర్ స్థాయిలో పరిష్కారం అవుతాయని తెలిపారు. గ్రామస్థాయిలో భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ పరిపాలన అధికారి జిపివో నియమించబోతున్నారన్నారు.

# కంపుకొడుతున్న "గుండ్లోరిగూడెం" డ్రైనేజీలు....?

### - దోమల బెడదతో అవస్థలు పడుతున్న గ్రామస్తులు

### - డ్రైనేజీలో నిలిచిపోయిన మురుగు నీరు



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని గుండ్లోరి గూడెం గ్రామ పంచాయతీలో డ్రైనేజీలు కంపు కొడుతున్నా యని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీలు మురుగునీరుతో బయటికి వెళ్లలేక దర్శనమిస్తున్నాయని యువకులు, మహిళలు విమర్శిస్తున్నారు. డ్రైనేజీ నీరు బయటకు వెళ్లే అవకాశం ఉన్న కానీ కాలువలు తీయలేక అట్టి మురుగు నీరు అక్కడే నిలిచిపోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో దోమల బెడదతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నామని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల గుండా వెళ్ళే మురుగు నీరు బయటకు వెళ్ళడానికి గతంలో కాలువ ఉండేదని కానీ గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు అట్టి కాలువను అక్రమించుకున్నట్లు సమాచారం. మురుగు నీరు బయటకు వెళ్ళడానికి అవకాశం ఉన్న కాలువ తీయక పోవడం గమనార్హం. ఇకనైనా జిల్లా, మండల అధికారులు చొరవ తీసుకుని మురుగు నీరు బయటకు వెళ్ళడానికి కాలువ తీసి బయటికి వెళ్ళే కలుపాలని వేడుకుంటున్నారు. డ్రైనేజీల మురుగునీరు బయటికి వెళ్లడానికి శాశ్వత డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

# సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై అక్రమ కేసులు నిరసిస్తూ కాంగ్రెస్ ధర్నా

### ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం



నల్గొండ, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలపై అక్రమ కేసులు బనాయిస్తుందని ఎమ్మెల్సీ, డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఈడి అక్రమంగా చార్జ్ షీట్ నమోదు చేయడానికి నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నల్గొండ లోని క్లాక్ టవర్ సెంటర్లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈడి, మోడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి ఈడి ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనయించారని ఆరోపించారు. కాంగ్రెస్, పార్టీ బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పాటు పడే పార్టీ అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపరచడానికి బిజెపి కుట్రలు చేస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే కాంగ్రెస్ నేతలపై అక్రమ కేసులు పెడుతుందని ఆరోపిం చారు. కేంద్రంలో బిజెపి అరాచక పాలన సాగిస్తుందని ధ్వజ మెత్తారు. బిజెపి ప్రభుత్వంలో దేశ సంపదలంతా సంపన్నులు దోచుకుంటున్నారని ఆరోపించారు.దేశం మొత్తం కులగణన చేసి వారికి రావలసిన వాటా కోసం రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలి పారు. దీనిని జీర్ణించుకోలేక కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఈడిని అడ్డం పెట్టుకుని అక్రమ కేసులు బనయిస్తుందని ఆరోపించారు. దేశ సంపదను దోచుకుంటున్న బిజెపి నాయకులు, సంపన్నులకు కొమ్ముకాస్తున్న వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.ఎన్ని కుట్రలు పన్నిన రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతూ అన్ని వర్గాల పేద ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని అన్నారు. రాష్ట్రంలో కాం గ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి ధ్యేయంగా ఎన్నో సంక్షేమ పథకాలతో ముందుకు

మిగతా 2లో

సూర్య



# మెండు దీపికా రెడ్డి జన్మదిన వేడుకలు



మర్రిగూడ, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ యువ నాయకురాలు మెండు దీపికా ప్రవీణ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేరకు హైదరాబాదులో ఆమె నివాసంలో సన్నిహితుల మధ్య జన్మదిన కేకును కట్ చేశారు.

# ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మిర్యాలగూడటౌన్, మేజర్ న్యూస్ ః పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గురువారం ఉదయం సైకిల్‌పై వెళ్తున్న షాబ్‌నగర్‌కు చెందిన గుంటి ఆదినారాయణ (73) గల వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హుటాహుటి న ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

## మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి




నూతనకల్, మేజర్‌న్యూస్ : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించిన 67వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, నాణ్యమైన విద్యను పొంది మంచి మార్కులు సాధిస్తూ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, చదువుతున్న పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్ పర్సన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, మండల విద్యాధికారి రాములు నాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అభేదా, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూ భారతి

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుందని, ఒకవేళ పరిష్కరించలేక పోతే చాలాన్ ద్వారా చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు. ధరణిలో వ్యవసాయ సబ్ డివిజన్ పై ఎలాంటి ప్రస్తావన లేదని, భూభారతి చట్టంలో సబ్ డివిజన్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న భూభారతి చట్టం లోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఇకపై బ్యాంకు రుణాలకు వెళ్ళినప్పుడు భూములకు సంబంధించిన కాగితాలను సమర్పించాల్సిన అవసరం లేదని, భూభారతి పోర్టల్‌లో నమోదైన రికార్డుల ఆధారంగానే బ్యాంకు రుణాలు ఇస్తారని తెలిపారు. భూభారతి చట్టంలోని ముఖ్యమైన అంశాలను ఆమె వివరిస్తూ భూభారతీ చట్టంలో మ్యుటేషన్లు ఆటోమేటిక్ గా అవుతాయని, 30 రోజుల్లో మ్యుటేషన్ కాకపోతే 31వ రోజు ఆటోమెటిగ్గా మ్యుటేషన్ జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ మ్యుటేషన్, సాదా బైనామాకు సంబంధించిన వివరాలు అన్నింటిని రైతులు ఇతర రైతులతో పంచుకోవాలని, చట్టంపై అందరికీ పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. భూభారతి చట్టంలోని అంశాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఆర్డిఓ కార్యాలయాల్లో ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇక్కడ ఫిర్యాదులను సమర్పించి పరిష్కరించుకోవచ్చని, ఒకవేళ రైతులకు ఎవరికైనా న్యాయసహాయం అవసరమైతే ఉచిత న్యాయ సహాయాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా భూములకు సంబంధించిన అవినీతిని అరికట్టి, రెవెన్యూ శాఖను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ భూ వివాదాలు లేని నియోజకవర్గంగా దేవరకొండ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దేందుకు భూ భారతి చట్టం ఉపయోగపడుతుందన్నారు. తమ ప్రభుత్వం 100 సంవత్సరాలు చెప్పుకునేలా ఒక గొప్ప చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. రైతులకు మేలు జరిగేలా ,భూ వివాదాలు లేని చట్టంగా ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. భూములకు సంబంధించిన అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం దొరికిందని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో ఇలాంటి ఆకాశము లేదని, ధరణి వల్ల అనేక సమస్యలు వచ్చాయని అన్నారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఎంతోమంది మేధావులు, అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని నాలుగు జిల్లాలలోని నాలుగు మండలాలలో పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని ప్రవేశపెట్టిన తర్వాత చట్టాన్ని తీసుకురావడం జరిగిందని, జూన్ 2 నుండి భూభారతి పోర్టల్ అమల్లోకి వస్తుందన్నారు. అంతేకాక ప్రభుత్వం గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన గ్రామ పరిపాలన రెవెన్యూ వ్యవస్థను తిరిగి బలోపేతం చేసే విధంగా పదివేల మంది గ్రామ పాలనా అధికారులను నియమించనున్నామని, దీని ద్వారా రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేయడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన, సన్న బియ్యం పంపిణీ ,వంటి ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని,, వీటన్నిటిని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ భూభారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలపై రైతులకు అవగాహన కల్పించారు .గతంలో ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని, ఇప్పుడు రికార్డుల నిర్వహణ ఉంటుందని, భూమి కలిగిన ప్రతి రైతుకు ఆధార్ కార్డు లాగే భూధార్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పిల్ వ్యవస్థ లేదని, ఇప్పుడు మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని, ప్రతి అంశం భూభారతి పోర్టల్ ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చు అని తెలిపారు. దేవరకొండ ఆడిషనల్ ఎస్పీ మౌనిక, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసిల్దార్ రామకాంత్ శర్మలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు, పిఎసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, మాజీ శాసనసభ్యులు యాదగిరి రావు, మండల వ్యవసాయ అధికారి పి.శ్రావణ్ కుమారి, మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, మాజీ జెడ్పిటిసిలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన రాజకీయ నాయకులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

భూ భారతి చట్టం ఏప్రిల్ 14 న ప్రారంభించి నాలుగు మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద అమలు జరుగుతుందని, ప్రతి జిల్లాలో ఒక్క మండలంలో అమలు చేస్తారన్నారు. ఏమైనా సమస్యలు పరిష్కారం కాకపోతే భూభారతి చట్టంలోని మార్పులు తెచ్చి భూ సమస్యలు తీర్చుతారన్నారు. జూన్ 2 నుండి రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం అమలు జరుగుతుందని తెలిపారు. బ్రతకడానికి భూమినే ఆధారం ఆ భూమి తమదని నిరూపించుకునేందుకు పట్టదారు పాస్ పుస్తకం ఉండాలన్నారు. భూ భారతి చట్టం ద్వారా 13 (బి) లకు పాస్‌బుక్ నందు పరిశీలించి వాటిని పట్టాదారు పాస్‌బుక్ నందు అప్‌డేట్ చేస్తామన్నారు. ఈ అవకాశం ధరణిలో లేదన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా వారసత్వం, పౌతి అమలు చేసేటప్పుడు గ్రామంలో నోటీసులు ఇచ్చి వారం గడువు ఇస్తామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం డిశంబర్ 31 న ప్రతి గ్రామంలో ప్రతి రైతులకు 1బి అందచేస్తామని ఏమైనా తప్పులు ఉంటే సరిచేస్తామన్నారు. భూములకు భూదార్ అనే యూనిక్యూ నెంబర్ ఇచ్చి ప్రతి భూమికి సరిహద్దులు నిర్ణయించి సర్వే మ్యాప్‌ని భూ భారతి పోర్టల్‌లో అప్‌డే ట్ చేస్తామన్నారు. భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవిన్యూ అధికారులు కృషి చేస్తారని తెలిపారు. భూ భారతి చట్టంపై పిపిటి ద్వారా కలెక్టర్ వివరించారు. సదస్సుకు వచ్చిన రైతులు నూతన చట్టం పట్ల చప్పట్లతో తమ హర్షం వ్యక్తం చేశారు. భూ సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయనే నమ్మకం ఉందన్నారు. రెవిన్యూ ప్రక్షాళనలో భాగంగా జిల్లాలో 279 మంది గ్రామ పరిపాలన అధికారులు రాబోతున్నారని వారితో పలు సమస్యలు గ్రామస్థాయిలో పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ చట్టంలో రైతుల భూమి రికార్డులలో భద్రంగా ఉంటుందని, రైతులకు భూభారతి ఆప్తమిత్రుడిగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో శ్రీనివాసులు, ప్రత్యేక అధికారి శ్యాంసుందర్,తహసీల్దార్ సురిగి సైదులు, ఎంపిడివో సోమ సుందర్‌రెడ్డి, ఏవో జావీద్, మున్సిపల్ కమిషనర్ యడవెల్లి అశోక్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొణతం చిన్నవెంకటరెడ్డి పాల్గొన్నారు.

# సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై అక్రమ కేసులు నిరసిస్తూ కాంగ్రెస్ ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

పోతుందని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ ఐదు సంవత్సరాలే కాకుండా మళ్లీ వచ్చే ఐదు సంవత్సరాలు కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో బిజెపికి ప్రజలు గుణపాఠం చెప్తారని, కేంద్రంలో ఆ ప్రభుత్వం పతనం అవుతుందన్నారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, నాయకులు కేసాని వేణుగోపాల్ రెడ్డి, జూలకంటి శ్రీనివాస్, సమద్, బొజ్జ శంకర్, ఇంతియాజ్ హుస్సేన్, అల్లి సుభాష్ యాదవ్, శ్రీనివాస్, గాలి నాగరాజు, ఇటికాల శ్రీనివాస్, ఇంతియాజ్ అలీ, గురీజ వెంకన్న, ఆలకుంట్ల మోహన్ బాబు, అమేర్, కరుణాకర్ రెడ్డి, కత్తుల కోటి, వంగాల అనిల్ రెడ్డి,దుబ్బ రూప, తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



సంస్థాన్ నారాయణపురం, మేజర్‌న్యూస్ ః విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన కొల్లూరి పవన్ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. పవన్ రోజువారి విధిగా మండలంలోని కొత్తగూడెం గ్రామంలో ఓ ఇంటిలో ప్లంబర్ పనికి వెళ్లగా అనుకోకుండా విద్యుత్ షాక్ గురైయ్యాడు. గమనించిన చుట్టుపక్కల వారు పవన్‌ను చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే పవన్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. చేతికోచ్చిన కోడకు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదనలు మీన్నంటాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగన్ తెలిపారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మునగాల, మేజర్‌న్యూస్ : మునగాల మండలం కేంద్రంలో గత నాలుగు రోజుల క్రితం వచ్చిన గాలి దుమ్ములకు మునగాలకు చెందిన తూముల వీరస్వామి పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుండి వచ్చిన ఎల్ టి వైర్లు తెగి కింద పడిపోయాయి. మరుసటి రోజు దానిని చూసి ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేయించినారు. గురువారం హార్వెస్టర్‌తో పొలం కోపిస్తుండగా హార్వెస్టర్ డ్రైవర్ లంకెల రాకేష్ గుర్తు తెలియని మృతదేహం పొలంలో ఉందని అతని వయస్సు 30 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని కుళ్ళిపోయి దుర్వాసన వస్తుందని పొలం యజమాని తూముల వీరస్వామికి తెలియజేశారు. వీరస్వామి వెంటనే పొలంలో కరెంటు వైర్లు నాలుగు రోజుల క్రితం కరెంటు ఎల్టీ లైన్ తెగిపడి ఉన్నాయని అట్టి కరెంట్ తీగల షాక్కు గురై చనిపోయి ఉండవచ్చని పోలీసులకు సమాచారం ఇచ్చినారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆసుపత్రి మాచర్లలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడు జీన్స్ ప్యాంటు, టీ షర్టు ధరించి యున్నాడు. ఏమైనా సమాచారం తెలిసినట్లు అయితే చరవాణి 8712686048, 8712686011నంబర్స్‌కి సమాచారం ఇవ్వగలరు. అని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి




భువనగిరి, మేజర్‌న్యూస్ : ఈనెల 21 22 తేదీలలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. గురువారం రోజున భువనగిరిలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును రద్దు చేసే ప్రతిపాదనను ఉపసంహరించు కోవాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, ప్రసూతి మరియు వివాహ కానుకను లక్ష రూపాయలకు పెంచాలని, సహజ మరణానికి ఐదు లక్షలు, ప్రమాద మరణానికి 10 లక్షల బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 21 22 తేదీలలో శంషాబాద్ పట్టణంలో జరిగే మహాసభలలో రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందించడం జరుగుతుందని కావున యాదాద్రి భువనగిరి జిల్లా నుండి అత్యధికంగా భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పబ్బల రాజు, ప్రధాన కార్యదర్శి బీరకాయల మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బాక సంజీవ, డిప్యూటీ కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి బహుపేట వెంకటయ్య, జిల్లా కమిటీ సభ్యులు సామల శోభన్ బాబు, రాజపేట మండల కార్యదర్శి చిగుర్ల లింగం తదితరులు పాల్గొన్నారు.

### భీమ్ యాత్రకు విజయవంతం కావడానికి సహకరించిన

# ఇలియాస్ మహమ్మద్‌కి ధన్యవాదాలు



భువనగిరి, మేజర్‌న్యూస్ : భువనగిరి పట్టణంలోని స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఎండీ ఇలియాస్ మహమ్మద్‌ను జై భీమ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మా నించి ధన్యవాదాలు తెలిపిన సందర్భంగా వారు మాట్లాడుతు అంబేద్కర్ ర్యాలీ ఎల్లపుడు తన వంతు సహాయం అందిస్తూ ఉంటా అని జై భీమ్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈరపాక నర్సింహాసిర్పంగా శివ లింగం, ఇటుకల దేవేందర్, అందె సాయి, భాస్కర్ నాయక్, బట్టు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఐజేయు ప్రింట్ మీడియా భువనగిరి పట్టణ సహాయ కార్యదర్శిగా ఎండీ జాకిర్ హుస్సేన్



భువనగిరి, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా, అధ్యక్షులు యంబ నర్సింహా భువనగిరి పట్టణానికి చెందిన ఎండీ జాకీర్ హుస్సేన్‌ను పట్టణ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికకు సహకరించిన, జిల్లా అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులకు, ప్రత్యేక ధన్యవాదములు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జాకీర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల కోసం తన వంతుసహాయ అందిస్తు పోరాటం చేస్తానని అన్నారు. అదే విధంగా జర్నలిస్టుల సంక్షేమనికి తన వంతు పాత్ర పోషిస్తారని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



నూతనకల్, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్రు శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని తాళ్ళసింగారం గ్రామంలో నిర్వహించిన ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఐదు సంవత్సరాల వయస్సు నిండిన విద్యార్థుల జాబితాను సేకరించి విద్యార్థుల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించినట్లు, ప్రభుత్వం విద్యార్థులకు అందించే వివిధ సౌకర్యాలను గురించి వివరించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సోమాని, వీరమల్ల సైదులు, గోసుల వెంకన్న, తోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక బృందాలను కేటాయించాలి

### డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లె మధు కృష్ణ, గడ్డం వెంకటేష్



భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లాలో వందల కోట్ల విలువ చేసే డ్రగ్స్ గంజాయి పట్టుబడుతున్న అధికారులు నామమాత్రపు చర్యలు తప్ప దీర్ఘకాలిక చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని దీనిపై ప్రత్యేకమైన బృందాలను ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లె మధుకృష్ణ, గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారము యువ చైతన్య సైకిల్ యాత్ర పోచంపల్లి మండలానికి చేరుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో అనేక పరిశ్రమలు ఉన్న పరిశ్రమలలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం, అదేవిధంగా యువతను డ్రగ్స్, గంజాయి బారి నుండి దూరం చేసే ప్రయత్నాలు చేయకపోవడం జిల్లాలో రోజురోజుకు వందల కోట్ల విలువ చేసే గంజాయి పట్టుబడుతున్న అధికార యంత్రాంగం నుండి ఎలాంటి కట్టుదిట్టమైన చర్యలు లేవని వారు అన్నారు. జిల్లా నుండి ఇంత విలువచేసే డ్రగ్స్ గంజాయి తరలిపోతున్న పోలీసు యంత్రాంగం నిఘా బలగాలను పెంచి ఎక్కడికి అక్కడ తనిఖీలు చేయాలని వారు సూచన చేశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి డ్రగ్స్ గంజాయిని ఎప్పటికప్పుడు నిర్మూలించకపోతే అనేకమంది యువత వారి జీవితాలు నాశనం అవుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కవిడే సురేష్, జిల్లా కమిటీ సభ్యులు దుబ్బాక జగన్, బండారు శ్రవణ్, ఎండి సోహెల్, సిఐటియు మండల కన్వీనర్ మంచాల మధు, ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్, హర్షవర్ధన్ రెడ్డి, చుక్క రజినీకాంత్, వంగూరి అనిల్ పాల్గొన్నారు.


# ఎమ్మెల్సీకి ఘన స్వాగతం





నిడమనూరు, మేజర్‌న్యూస్ : ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు నిడమనూరు కాంగ్రెస్ నాయకులు గురువారం ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా నూతనంగా ఎన్నికైన కేతావత్ శంకర్‌నాయక్ మొదటిసారి నిడమ నూరు రావడంతో మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం స్థానిక నాయకు లతో కలిసి ఎమ్మెల్సీని మార్కెట్ కార్యాలయానికి ఆహ్వానించారు. అనంతరం అంకతి సత్యం, కాంగ్రెస్ నాయకులు పూల బొకే, శాలువాతో ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అంకతి రుక్మిణి, నాయకులు ఉన్నం సత్యనారాయణ, నందికొండ మట్టారెడ్డి, శేషరాజు దాసు, మాజీ సర్పంచ్ విజయ్ కుమార్, కుంచం సతీష్, పురుషోత్తం, పోలే రవి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవం



భువనగిరి, మేజర్‌న్యూస్ : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది.సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువు తీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్ప మాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వ ర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం. స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది. అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ, తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు. వేదమంత్రోచ్చారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు. ఉదయం 10:30లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి నవరత్నఖచిత స్వర్ణాభరణాలతో, పరిమళ భరిత పుష్ప మాలలతో అలంకరించి శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీవారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా తిలకించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30కు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్య మానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని ఆర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు శ్రీవారిని నయనానందకరంగా దర్శించుకున్నారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

# తొమ్మిది గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

## భూ భారతి దేశంలోనే మొదటి రెవెన్యూ సంస్కరణ

## ధరణితో దరిద్రం పోయింది

తిరుమలగిరి మేజర్ న్యూస్ : దేశంలో భూ భారతి గొప్ప రెవెన్యూ వ్యవస్థ అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో చర్చించి నియోజకవర్గంలోని 9 మండలాల్లో 9 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా సెలెక్ట్ చేశామని అన్నారు. రేపటి నుండి గ్రామాలలో ఇండ్ల నిర్మాణం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లు తుంగతుర్తి ఎస్సీ నియోజకవర్గం కానుక అదనంగా 1000 ఇండ్లు ఇవ్వాలని మంత్రి పొంగులేటిని అడగగా ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విధానం ఎమ్మెల్యే నిర్ణయం ఉంటుందని అన్నారు. భూ భారతి రెవెన్యూ వ్యవస్థ దేశంలోనే మొట్టమొదటి రెవెన్యూ సంస్కరణ అని కొనియాడారు. ధరణితో రాష్ట్రంలో దరిద్రం పోయిందని అన్నారు. గతంలో పాలకులు ధరణి వ్యవస్థతో భూ దందాలు చేసి నిరుపేదల భూములు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని అన్నారు. భూ భారతిలో ఉన్న సెక్షన్‌లు చదివి వినిపించారు. భూ సమస్యలు ఏమి ఉన్న తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌ల ద్వారా పరిష్కరించబడుతాయని అన్నారు. కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఎవరికి లేదని అలాంటి ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు లోపాయకర ఒప్పందాలు కుదుర్చుకోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని కొనియాడారు. దేశ చరిత్రలోనే సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. తెలంగాణలో 10 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ యాదగిరి, ఆర్డీవో వేణుమాధవరావు, 9 మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎల్సోజు నరేష్, జుమ్మిలాల్ పాల్గొన్నారు.



# బిపి మండల్ అవార్డు అందుకున్న దయా యాదవ్



తిరుమలగిరి మేజర్ న్యూస్ : హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో బిసి రిజర్వేషన్ పితామహుడు బీహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ మండల్ పేరుతో బిపి మండల్ అవార్డును తాటిపాముల గ్రామానికి చెందిన దయా యాదవ్‌కు బిసి సంఘం వ్యవస్థాపకులు ఆర్.కృష్ణయ్య, బిసివై పార్టీ జాతీయ అధ్యక్షులు రాంచంద్ర యాదవ్‌లు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో వట్టే జానయ్య యాదవ్, నిర్మాత చిన్న శ్రీశైలం యాదవ్, ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సూరజ్ మండల్ తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కోర్టును ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి రాధారాణి



హుజూర్‌నగర్ రూరల్, మేజర్‌న్యూస్ : నూతనంగా మంజూరు అయిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును గురువారం హైకోర్టు న్యాయమూర్తి, సూర్యాపేట జిల్లా పోర్టు పోలియో జడ్జి రాధారాణి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్‌కుమార్, లక్ష్మణ్, సుజనలతో కలసి పర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో పెండింగ్ కేసుల సంఖ్య అధికంగా ఉందని, కేసుల పెండింగ్ భారాన్ని తగ్గించడానికి నూతన కోర్టులను మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రాంరెడ్డి విన్నవించడంతో ఆయన అభ్యర్థన మేరకు నూతన కోర్టును మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కోర్టును ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి నూతన కోర్టు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె ఆకాంక్షించారు. నూతన కోర్టును ప్రారంభిస్తే తప్ప జడ్జిని కేటాయించడం సాధ్యం కాదని అందువలన ఈ కోర్టును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. నూతన కోర్టుల సముదాయాన్ని అలాగే న్యాయమూర్తుల వసతి గృహాల నిర్మాణాల కొరకు బార్ అసోసియేషన్ సభ్యులు రాంరెడ్డి ఆధ్వర్యంలో నిరంతరం కృషి ప్రభుత్వం నుండి నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయింపు చేసుకోవడం సంతోషదాయకమన్నారు. సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్ మాట్లాడుతూ హుజూర్‌నగర్ న్యాయవాదుల చిరకాల వాంఛ ఈ నూతన కోర్టు ప్రారంభోత్సవంతో నెరవేరినట్లు బావిస్తున్నానన్నారు. పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెర్వు,చింతలపాలెం పోలీస్టేషన్ల పరిధిలోని క్రిమినల్ కేసులు ఆయా మండలాలలోని సివిల్ కేసులు మొత్తం 3067 కేసులను నూతన కోర్టుకు కేటాయించామని,ఆ కేసులను నూతన కోర్టులో విచారించనున్నట్లు ఆయన తెలిపారు. న్యాయమూర్తుల ఎంపిక కొరకు పరీక్షలు రాసిన అభ్యర్థులలో అనుకున్న స్థాయిలో న్యాయమూర్తులుగా ఎంపిక కాకపోవడం మూలంగా ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయలేకపోతున్నామన్నారు. న్యాయవాదులు పోటీ పరీక్షలలో పాల్గొని కష్టపడి చదవి న్యాయమూర్తులుగా ఎంపిక అయినట్లయితే న్యాయమూర్తుల కొరత తీరుతుందని అందుకు హుజూర్‌నగ ర్ న్యాయవాదులు కృషి చేయాలని ఆయన కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 29 మంది న్యాయమూర్తులు ఉండగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చాలా కోర్టులలో న్యాయమూర్తుల కొరత మూలంగా న్యాయమూర్తులు లేక ఖాళీగా ఉన్న న్యాయసానాలకు న్యాయమూర్తులను భర్తీ చేయలేకపోతున్నామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నపం మేరకు త్వరలోనే నూతన కోర్టులకు న్యాయమూర్తిని కేటాయించడానికి ప్రయత్నిస్తానని ఆయన హామీ ఇచ్చారు. న్యాయమూర్తి సుజన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 8వేల కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉండగా ఒక్క హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 8500 కేసులు పెండింగ్‌లో ఉండటం ఆశ్చర్య పరిచిందన్నారు. పెండింగ్ కేసుల భారాన్ని పరిగణలోకి తీసుకుని బార్ అసోసియేషన్ విన్నపం మేరకు నూతన కోర్టును మంజూరు చేస్తామని తెలిపారు. ఈ న్యాయస్థానానికి న్యాయమూర్తిని త్వరలోనే కేటాయించడానికి ప్రయత్నిస్తామన్నారు. అంతకముందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుండి 4 ఎకరాల స్థలాన్ని కేటాయింపు చేయించుకున్నామని ఆ స్థలంలో న్యాయస్థానాల సముదాయంతో పాటుగా 8 కోర్టులకు సరిపోను న్యాయస్థానాల సముదాయం, న్యాయమూర్తుల వసతిగృహాల నిర్మాణానికి హైకోర్టు న్యాయమూర్తులు అనుమతులు జారీ చేయాలని, అలాగే నూతన కోర్టుకు సాధ్యమైనంత త్వరలో న్యాయమూర్తినిగా కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. 8500 కేసులు పెండింగ్‌లో ఉండటం, జూనియర్ సివిల్ జడ్జి ట్రైనింగ్‌లో వెళ్లడంతో కోదాడ కోర్టుకు వెళ్లవలసి వస్తుందని, తద్వరా న్యాయవాదులు కక్షిదారులు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారని దానిని దృష్టిలో ఉంచుకుని నూతన కోర్టుకు న్యాయమూర్తిని కేటాయించినట్లయితే కక్షిదారులకు, న్యాయవాదులకు సులభతరంగా ఉంటుందని అందువలన వెంటనే న్యాయమూర్తిని కేటాయించాలని అభ్యర్థించారు. సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్ మాట్లాడుతూ హుజూర్‌నగర్ న్యాయవాదుల అభ్యర్థన మేరకు అదన పు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరీ చేయడం పట్ల హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్యాంశ్రీతో పాటు పలువురు న్యాయమూర్తులను గజమాలలు,శాలువాలు,బోకేలతో ఘనంగా సత్కరించి మెమోంటోలు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, జిల్లా ఎస్పీ నరసింహా, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జిలు జిట్టా శ్యాంకుమార్, సురేష్, పర్వీన్ కౌసర్, జూనియర్ సివిల్ జడ్జి భవ్య శ్రీ, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,అదనపు గవర్నమెంట్ లీడర్లు, పలువురు సీనియర్,జూనియర్ న్యాయవాదులు, న్యాయశాఖ,పోలీస్, రెవిన్యూ,ఎక్సైజ్,విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మునగాల, మేజర్‌న్యూస్ : మునగాల మండల కేంద్రంలో మండల పరిధిలోని మొద్దుల చెరువు గ్రామంలో మహిళా సమాఖ్య (ఐకెపి) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసిల్దార్ వి.ఆంజనేయులు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, మండల వ్యవసాయ అధికారి బుంగరాజు, ఏఈఓలు రమ్య తేజ, భవాని నాగు, మాజీ వైస్ ఎంపీపీ కె.బుచ్చి పాపయ్య, మండల పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక సేవా కార్యకర్త గంధం సైదులు, వేనేపల్లి వీరబాబు, సుంకరి పిచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొమ్ము ఈదరావ్, నారాయణ గూడెం మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, ఐకెపి నిర్వాహకులు కిన్నెర సామ్రాజ్యం, నాగరాణి జయశ్రీ అశ్విని సైదులు తదితరులు పాల్గొన్నారు.

**చౌటుప్పల్ :** మండల పరిధిలోని పెద్ద కొండూరు గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో



ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పిఏసిఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, పిఎంసి చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డిలు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, డైరెక్టర్ కృష్ణ, గుండెబోయిన రూపమ్మ, నాయకులు పబ్బు రాజు, సంజయ్‌బాబు, శ్రీకాంత్, శ్రీనాథ్, బద్దం కొండల్‌రెడ్డి, పాండురెడ్డి, దాన్‌రెడ్డి, నరసింహారెడ్డి, భూపాల్‌రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడిగా రవీందర్ సేవలు అభినందనీయం



హాలియా, మేజర్‌న్యూస్ : ఉపాధ్యాయునిగా మారం రవీందర్ ఉపాధ్యాయ వృత్తిలో 36 సంవత్సరాలు విద్యార్థులకు అందించిన సేవలు అభినందనీయమని, పెద్దవూర మండలం పెద్దగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా ,బయోసైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేసిన మారం రవీందర్ పదవీ విరమణ పొంది ఏర్పాటు చేసిన పదవీ విరమణ సమావేశంలో పాల్గొనడం జరిగినది. విద్యాధికారి మాట్లాడుతూ సునిత మనస్తత్వం కలిగి విద్యార్థుల మనసులు నొప్పించకుండా వారి ఉన్నతి కోసం ఉపాధ్యాయుడిగా విశేషంగా కృషి చేశాడని, పనిచేసిన ప్రతిచోట పలువురితో పేరు తెచ్చుకున్న వ్యక్తి అని కొనియాడారు, పెద్దగూడెం పాఠశాల విద్యార్థులు పూలు చల్లుతూ స్వాగతం పలికారు, పిఆర్‌టియు, యుటిఎఫ్, అవాస్ సంఘాల నాయకులు బంధుమిత్రులు వాసవి వనత క్లబ్ సభ్యులు వారిని పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో విద్యాధికారి గుండా కృష్ణమూర్తి, హెచ్.ఎమ్.నారాయణరెడ్డి, వెంకటేశం, పెరమాల వెంకటేశం, మంచిగంటి మధు, వీరారెడ్డి, పాపిరెడ్డి, చెన్ను వెంకటరెడ్డి, దేవేందర్, ఎన్ వెంకట్రెడ్డి, శైలజ, రూపారెడ్డి, చింతల వెంకటేశ్వర్లు, సుబ్బారావు, జానారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, కే.శ్రీనివాస్ రెడ్డి, కే.శోభన్ బాబు, శేఖర్, సక్రు నాయక్, వెంకన్న, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద ఎత్తున బిఆర్ఎస్ రజతోత్సవ సభ


### మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : ఎవరు ఊహించని విధంగా పెద్ద ఎత్తున టిఆర్ఎస్ రజతోత్సవ సభను భారీగా నిర్వహిస్తున్నామని మాజీ ప్రభుత్వ విప్ ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. టిఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన సన్నాహక సమావేశం గురువారం యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టిఆర్ఎస్ రజతోత్సవ సభకు 25 వసంతాల వేడుక జయప్రదం కై తరలిరావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పుడెప్పుడు కేసీఆర్ను చూద్దామా అని టిఆర్ఎస్ రజతోత్సవ సభకు ఎప్పుడు వెళ్దామని ఉత్సాహంతో ఉన్నారని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో భారీ ఎత్తున తరలి వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల కంటే ముందు ఆలేరు నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముందుగానే సభా ప్రాంగణానికి చేరుకోవాలని అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే ఈ సభ సంచలనంగా పెద్ద ఎత్తున జరగనుందని అన్నారు. ఆరోజు కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయి ఉన్నారని పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదని రైతులకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా భువనగిరి పార్లమెంటు అభ్యర్థిగా టిఆర్ఎస్ నుండి పోటీ చేసిన క్యామ మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని తిరిగి టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ తిరిగి బీఆర్ఎస్ వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు కష్టాలు పడుతున్నారని విమర్శించారు. మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారని అన్నారు. అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ రజతోత్సవ సభకు సంబంధించిన కరపత్రాలు వాల్ పోస్టర్లు, డైరీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య, పిఏసిఎస్ చైర్మన్ ఇమ్మిడి రామిరెడ్డి, నాయకులు గడ్డమీది రవీందర్ గౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి, మిట్ట వెంకటయ్య, గుండ్లపల్లి వెంకటేష్, తోటకూరి బీరయ్య, పాపట్ల నరహరి, మాజీ జెడ్పిటిసి తోటకూర అనురాధ, స్వాతి, శిఖ శ్రీనివాస్, పాండవుల భాస్కర్ గౌడ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# యాగమూర్తులకు హారతిస్తున్న పూజారి

యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో గురువారం నిత్య ఆరాధనలు శాస్త్రయుక్తంగా సాగాయి. హరిహరులను ఆరాధిస్తూ మొక్కులు చేపట్టారు. వేకువజామున సుప్రభాతం చేసి పూజారులు హారతి నివేదించారు. ఉత్సవ మూర్తులకు అభిషేకించి అర్పించారు. వేదమంత్రాలతో ఆలయంలో సుదర్శన నారసింహ హెూమం చేపట్టారు. విశ్వక్సేన ఆరాధనతో నారసింహ కళ్యాణం చేశారు. చరమూర్తుల మందిరంలో రామలింగేశ్వర స్వామిని కొలుస్తూ అభిషేకం చేశారు. పాత గుట్టలో నిత్యారాధనలు కల్యాణోత్సవ పర్వాలు జరిగాయి.



# భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్క పౌరుడు పై ఉంది

### - ఎమ్మెల్యే మందుల సామేల్





మోత్కూర్, మేజర్‌న్యూస్ : భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్క పౌరుడు పై ఉందని ఎమ్మెల్యే సామేలు అన్నారు. గురువారం మండలంలోని పాలడుగు గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు పాల్గొని గ్రామంలో భారత రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, వ్యవస్థలని భారత రాజ్యాంగాన్ని కాలరాస్తూ, ప్రజలకు కావలసిన సమాన హక్కులను, స్వేచ్ఛలను అవమానపరుస్తూ పరిపాలన కొనసాగిస్తుందని ఈ సందర్భంలో భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్క పౌరుడు పైన ఉందని, భారత రాజ్యాంగాన్ని కాపాడాలనే దృఢ సంకల్పం తో కాంగ్రెస్ పార్టీ మహాత్మ గాంధీ అనుసరించిన శాంతి, అహింస సిద్ధాంతాలను అస్త్రాలుగా చేసుకొని, రాజ్యాంగం లోని ఆర్టికల్స్ వివరిస్తూ, గ్రామంలోని ప్రజలను చైతన్య పరుస్తూ ముందుకు సాగడమే జై బాపు జై భీమ్ జై సంవిధన్ కార్యక్రమం అని అన్నారు. అనంతరం గ్రామంలో త్రాగునీటి బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ డైరెక్టర్ కొంపెల్లి లలిత, మాజీ సర్పంచ్ మర్రిపెల్లి యాదయ్య,మాజీ ఎంపీటీసీ అంతటి నర్సయ్య, ఆకవరం లక్ష్మణ చారి,మాజీ సర్పంచ్ ముక్కముల వీరయ్య,సుదగాని పాండు, మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల భగవంత్, సీనియర్ నాయకులు బద్ధం యాదిరెడ్డి, ముక్కముల గంగుమల్లు ,బద్ధం సత్తిరెడ్డి, వల్లపు సైదులు, ముప్పిడి నర్సింహా, కొంపెల్లి గోరయ్య,ముక్కర్ల మహేష్, మర్రిపెల్లి ఉప్పేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేషనల్ కాన్ఫరెన్స్ కేంద్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన

# గురుజ రామచంద్రంకి పలువురు శుభాకాంక్షలు



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని కచలాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గురిజ రామచంద్రం ఆల్ ఇండియా కిసాన్ సభ 30 వ నేషనల్ కాన్ఫరెన్స్ కేంద్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన్నారు. ఈ సందర్భంగా గురుజ రామచంద్రంకి మండల వ్యాప్తంగా పలువురు హర్థిక శుభాకాంక్షలు తెలిపారు. కర్షక కార్మికుల పక్షనా నిరంతరం పోరాటం చేసిన నాయకుడికి నిజమైన గుర్తింపు లభించిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

## సట్టు తిరుమలేష్



రాజపేట, మేజర్‌న్యూస్ : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాజపేట మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ పిలుపునిచ్చారు. ఈనెల 27 వ తేదీన వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ నేపథ్యంలో ఈనెల 18న రాజాపేటలోని చెలిమెడి ఫంక్షన్ హాల్ లో బీఆర్ఎస్ మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సమావేశానికి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. మండల పార్టీ కుటుంబ సభ్యులందరూ పెద్ద ఎత్తున సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సెక్రటరీ సంధిల భాస్కర్ గౌడ్, అంకతి సుదర్శన్, ఎర్ర గోకుల జశ్వంత్,బెడిదె వీరేశం, కర్ల కర్ణాకర్ రెడ్డి, గంధమల్ల సురేష్, అంకతి నరసయ్య పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నూతన చెర్మన్ కమిటీ మెంబెర్స్ ఎన్నిక



మర్రిగూడ, మేజర్‌న్యూస్ : మండలంలోని భీమనపల్లి గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నూతన చెర్మన్, కమిటీ మెంబెర్స్ గురువారం దేవాదాయ శాఖ అధికారులు సుమతి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. నూతన చైర్మన్‌గా మాజీ సర్పంచ్ మునగాల అంతిరెడ్డి, కమిటీ మెంబెర్స్ వనమాల జైరాములు, చిలువేరు శంకర్, జిల్లా శంకర్, వస్పరి రాములమ్మ లతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మేకల ప్రేమ్ కుమార్, మునగాల జగన్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు దోమల వెంకటయ్య యాదవ్, మల్గిరెడ్డి గోపాల్ రెడ్డి, మల్గిరెడ్డి వెంకట్ రెడ్డి, కర్నాటి సత్తయ్య గౌడ్, కొండూరు శేఖర్ గుప్తా, జిల్లా కృష్ణయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు గొడ్డేటి నర్సింహా, అంబళ్ల రవి గౌడ్, మునగాల సత్యనారాయణ, చిలువేరు నరేష్, జిల్లా కిషోర్, జిల్లా సురేష్, నర్సింహా పాల్గొన్నారు.

# వికలాంగుల హక్కుల పోరాట సమితి

మిర్యాలగూడటౌన్,మేజర్‌న్యూస్ః వికలాంగుల హక్కుల పోరాట సమితి మిర్యాలగూడ నియోజకవర్గం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో విహె చ్‌పిఎస్ సీనియర్ నాయకులు ఎం.డి అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త వెంకన్నయాదవ్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం పూర్తిగా విఫలం చెందిందన్నారు. వికలాంగుల ఫించన్ రూ.6 వేలు, చేయూత ఫించన్ రూ.4 వేలు పెంచాలన్నారు. వికలాంగుల



సంక్షేమశాఖ స్వతంత్రంగా ఏర్పాటు చేయాలని, వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని,డబుల్‌బెడ్‌రూం ఇండ్లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, వికలాంగులకు స్థానిక సంస్థల్లో ఐదుశాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. వికలాంగులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షురాలు కసిరెడ్డి చైతన్యరెడ్డి, జిల్లా నాయకులు రాచూరి సైదులు, గుగులోతు మదన్‌నాయక్, వల్లందాస్ శ్రీను, మహిళా నాయకురాలు రత్నకుమారి, ఎం.డి కలీం, సుధాకర్, సైదిరెడ్డి, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

## పంచాక్షరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

## యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల సైదులు



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని కొరటికల్ గ్రామంలో పంచాక్షరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 45 రోజుల నుంచి మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను నిర్వహించారు.శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల సైదులు మహిళలకు తన స్వంత ఖర్చులతో ఉచిత కుట్టు మిషన్లు పంపిణి చేశారు. అనంతరం ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేసిన సందర్భంగా పంచాక్షరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ మహిళలు మందుల సైదులుని శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మందుల సైదులు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేసే అన్ని కార్యక్రమాలు మా సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దండు లింగస్వామి తో పాటు ఫౌండేషన్ చైర్మన్ కారింగు పల్లవిని మహిళలందరూ పూల బొకేతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టి నాయకులు అయితరాజు పెద్దులు, ఏళ్లంకి రమేష్, గ్రామ ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోషక విలువలు కలిగిన ఆకు కూరలను మాత్రమే తీసుకోవాలి

## ఐసిడిఎస్ సూపర్వైజర్ మీర్యాల నాగమణి

మునుగోడు, మేజర్‌న్యూస్ : పోషక విలువలు కలిగిన ఆకు కూరలను మాత్రమే తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ మీర్యాల నాగమణి అంగన్వాడి సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని సింగారం గ్రామపంచాయతీలో అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, పిల్లలు తీసుకోవలసిన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. గర్భిణీ దశ నుంచి మొదలుకొని బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి, మంజుల, నరేందర్, శ్రీదేవి టీచర్లు, ఆశా వర్కర్ కోతి సుగుణమ్మ, అంగన్వాడీ టీచర్స్ గుర్రాల యశోద, లక్ష్మి, ఆయా షేక్ మహబూబ్ బి, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.



# శంకరయ్య మృతి సిఐటియుకు తీరని లోటు

## సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నాగేష్



చిట్యాల, మేజర్‌న్యూస్ : మెరుగుమళ్ళ శంకరయ్య అకాల మరణం గ్రామ పంచాయతీ కార్మిక సంఘానికి తీరని లోటని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో గురువారం నాడు జరి గిన శంకరయ్య సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. శంకరయ్య కుటుం బ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లం మహేష్, మండల నాయకులు అరూరి శ్రీను, పంది నరేష్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటీయు) నాయకులు మంకాల బాలమ్మ, లింగయ్య, గణేష్, యాదయ్య వివిధ ప్రజా సంఘాల నాయకులు అరూరి శంభయ్య, నర్సింహా, సాయి, లింగయ్య పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకుని మోసపోకూడదు

## వేముల నాగరాజు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు



వలిగొండ, మేజర్‌న్యూస్ : భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించగా ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు పాల్గొని మాట్లాడుతూ వలిగొండ శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకొని మోసపోవద్దన్నారు గతంలో హడావుడిగా ఎలాంటి పర్మిషన్ లేకుండా అడ్మిషన్ వర్క్ ప్రారంభించినప్పుడు వందలాది సంఖ్యలో విద్యార్థుల అడ్మిషన్లు తీసుకొని పాఠశాల సీజ్ కావడంతో తల్లిదండ్రులు డబ్బులు నష్టపోయిన పరిస్థితి ఉంది అన్నారు మళ్లీ గతం లాగానే పూర్తిస్థాయిలో పర్మిషన్ లేకుండా అక్కడమీక్ ఇయర్ ముందే అడ్మిషన్ వర్క్ ప్రారంభించడం సరైన్నది కాదున్నారు మండల విద్యాధికారి వెంటనే స్పందించి చైతన్య పాఠశాల పైన చర్యలు తీసుకోవాలన్నారు గ్రామాలలో దిగబడి ప్రచారం చేస్తు పేద మధ్యతరగతి తల్లిదండ్రులని ఆకట్టుకునె ప్రయత్నం చేసి డబ్బులు మరోసారి దండుకునేందుకు ప్రయాణిస్తున్నారు ఇలాంటి పూర్తి స్థాయిలో పర్మిషన్ లేని పాఠశాలలో మీ పిల్లలను చేర్చి అడ్మిషన్లు వేసి భవిష్యత్ కరాబ్ చేయొద్దు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బుగ్గ ఉదయ్,మండల అధ్యక్షులు మైసొల్ల నరేందర్, సాయి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఊరు వాడ గిరిజన తండలలో, గూడాల్లో

# కొనసాగుతున్న యాత్రలు

తుర్కపల్లి, మేజర్‌న్యూస్ : తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధనావత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం దత్తయపల్లి, వెలుపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో తండాల్లో గల్లి గల్లి తిరుగుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశం మొత్తం ఏకం కావాలని రాజ్యాంగాన్ని కాపాడుకుందాంమని పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ అహింసా, శాంతి సిద్ధాంతాలను అలవర్చిన మహాత్మా గాంధీని స్మరించుకుందాం రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుందాం అంటూ గత కొన్ని రోజులుగా స్వతంత్ర సమరయోధులు జాతిపిత మహాత్మా గాంధీ, అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, వారి పట్ల నిండు పార్లమెంట్ సాక్షిగా చులకన చేసి మాట్లాడిన విషయాలను తెలంగాణ ప్రజానీకానికి తెలపడానికి పాదయాత్ర చేయడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకే నిర్వహించినట్లు తెలిపారు.

# కాలిన టేకు మొక్కలు, మామిడి తోట

### రూ.10 లక్షలు నష్టపోయిన రైతులు





నూతనకల్, మేజర్‌న్యూస్ : 200 టేకు మొక్కలు,80 మామిడి చెట్లు, చెట్లకు గల నాలుగు టన్నుల మామిడికాయలు, తోటలో పరిచిన డ్రిప్పు పైపులతో సహా కాలి పోయి రైతుకు 10 లక్షల రూపాయల నష్టం జరిగిన సంఘటన మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతులు కొలిచెల్మ లింగయ్య, శ్రీనివాస్, ఉపేందర్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తోటకు ప్రక్కన ఉన్న రైతు ఎండిపోయిన పత్తి కర్రకు నిప్పు పెట్టగా ఎండాకాలం కావడంతో గాలికి ఆ పత్తి చేను మంటలు మామిడి తోటలోకి వ్యాపించడంతో తోటలోని 80 మామిడి చెట్లు, 200 టేకు చెట్లు అగ్నికి ఆహుతి అవ్వడంతో రైతులు దిగ్భ్రాంతికి లోన య్యారు. చేతికి వచ్చిన, వారంలో కోయడానికి సిద్ధంగా ఉన్న నాలుగు టన్నుల మామిడికాయలు, టేకు మొక్కలు, డ్రిప్పు పైపులు కాలిపోవడంతో పది లక్షల భారీ నష్టం వాటిల్లడంతో రైతులు వాపోయారు.

**రైతులను ఆదుకుంటాం**

తోటకు నిప్పు అంటుకొని రైతులకు భారీగా నష్టం వాటిల్లినదని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు.కాలిన తోటను పరిశీలించి చూసి మాట్లాడారు.తోటను పరిశీలించిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు తొణుకునూరి సైదులు గౌడ్, నాయకులు గుగులోత్ కృష్ణ నాయక్, గాజుల వెంకటయ్య, లింగాల రామచంద్రయ్య, గుండా సోమయ్య, లింగాల వెంకన్న, కొమ్మనబోయిన యాదగిరి తదితరులు ఉన్నారు.

# వెలిమినేడులో సిపిఎంలో చేరిక

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ సమక్షంలో చేరిక

చిట్యాల, మేజర్‌న్యూస్ : సిపిఎం ప్రజా కార్యక్రమాలకు ఆకర్షితులై వెలిమినేడు గ్రామంలో గురువారం పలువురు యువకులు ప్రజా సంఘాల్లో సభ్యులుగా చేరారు. సిపియం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ సమక్షంలో కూనూరు గణేష్ ఆధ్వర్యంలో పలువురు యువకులు చేరారు. ఈ సందర్భంగా నగేష్ వారికి ప్రజా సంఘాల కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లం మహేష్, సిపిఎం మండల నాయకులు అరూరి శ్రీను, పంది నరేష్, దేశబోయిన నర్సింహా, మామిడి రాములు, అరూరి దుర్గయ్య, చిర్రబోయిన లింగయ్య, అరూరి నర్సింహా, వడ్డగాని మహేష్, గోలి సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయిలో

# ప్రథమ బహుమతి పొందిన శ్రీ చైతన్య విద్యార్థులు



మిర్యాలగూడటౌన్,మేజర్‌న్యూస్ః పట్టణంలోని కేశవనగర్ కాలనీలో గల శ్రీ చైతన్య పాఠశాల బ్రాంచ్ విద్యార్థిని, విద్యార్థులు నాసా సెటిల్మెంట్ కాంటెస్ట్ 2025 జాతీయ స్థాయిలో మొదటి బహుమతి పొందడం జరిగింది. ఈ కాంటెస్ట్‌లో విజేతలైన విద్యార్థిని,విద్యార్థులు కనిష్క, నిత్యశ్రీ, ఆర్యశ్రీ, దీక్షిత, సంహిత, మనిషారెడ్డి, దేవరాజ్, అక్షిత, సాయిచరణ్‌లకు రూరల్ సిఐ పిఎన్‌డి ప్రసాద్, ఎస్ఐ కృష్ణయ్య,, గోల్డ్ మెడల్, సర్టిపికెట్స్‌తో సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మాలెంపాటి శ్రీధర్, డైరక్టర్ విద్య, డిజిఎం సుధాక ర్, ఆర్ఐ సుజాత, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విజేతలకు అభినందనలు తెలిపారు.

### మునుగోడు ఆర్అండ్‌బి ఉప కార్యనిర్వాక ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన

# పంజాల శరత్ చంద్రకు పలువురు శుభాకాంక్షలు



మునుగోడు, మేజర్‌న్యూస్ : మునుగోడు ఆర్అండ్‌బి ఉప కార్యనిర్వహక ఇంజనీర్ గా బాధ్యతలు స్వీకరించిన పంజాల శరత్‌చంద్రకి గురువారం పలువురు నాయ కులు మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మా నించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు సురిగి చలపతి నకరికంటి యాదయ్య, నకిరకంటి నరసింహ, ఈదులకంటి కైలాస్, సరికొండ ముత్యాలు, పగడాల నాగయ్య, సురిగి మారయ్య గౌడ్ పాల్గొన్నారు.

# న్యాయవాదుల సంరక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

చౌటుప్పల్,మేజర్‌న్యూస్ః న్యాయవాదుల మీదు దాడులు పెరిగిపోతున్నాయని వెంటనే న్యాయవాద సంరక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యం వెంకటచలపతి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణంలోని కోర్టు ముందు సూర్యాపేట కోర్టు న్యాయవాది కిషోర్ మీద ప్రైవేట్ వ్యక్తుల దాడిని ఖండిస్తూ నిరసన నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో



బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాపోలు వేణు, కోశాధికారి జల్లా రమేష్, గ్రంథాలయ కార్యదర్శి జక్కర్తి శేఖర్, జ్యోతి, ఖయ్యూమ్ పాషా, సత్తిరెడ్డి, మోహన్, శ్రీనివాస్, పరమేష్ పాల్గొన్నారు.

# రామడుగు, చింతగూడెంలో బడిబాట



హాలియా, మేజర్‌న్యూస్ : రామడుగు, చింతగూడెం గ్రామంలో జరిగిన బడిబాట కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి సత్యవతి, ఏఏపీసి చైర్మన్ కళ్యాణి నాగయ్య, కూరాకుల మాధవి చింతగూడెం చైర్మన్, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు మధుసూదన్, ఉపాధ్యాయులు ప్రసాదు శ్రీనివాస్, ఎం.నరసయ్య ఎల్ శ్రీనివాస్ పంచాయతీ సెక్రెటరీ గిరి, అంగన్వాడి టీచర్ యమునా, అరుణ, ఆశా వర్కర్ రామేశ్వరి, పాఠశాల సిబ్బంది సైదమ్మ సాయమ్మ, మధ్యాహ్న భోజన సిబ్బంది లక్ష్మయ్య, లింగమ్మ, పార్వతమ్మ, పంచాయతీ సిబ్బంది రాంబాబు మల్ల య్య కోటయ్య, గ్రామ పెద్దలు విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామ యువకులు పాల్గొ న్నారు. ఇట్టి కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ గ్రామం లో చదువుతున్న విద్యార్థులు అందరూ మన గ్రామ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిం చాలని, ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన విద్య అందుతుందని తెలియజేసినారు.

# పోషకాహారంలో గర్భవతులకు పిల్లలకు అవగాహన సదస్సు

పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలో పోషణ పక్వాడ్లో భాగంగా గర్భ వతులకు పోషకాహారంలో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఓ ఎం.సుబ్బలక్ష్మి అన్నారు. పెన్‌పహాడ్ సేర్ప్ పొదుపు కార్యాల యంలో గురువారం పోషణ పక్షంలో భాగంగా శ్రీమతులు అక్షరాభ్యాసాలు అన్న ప్రసన్నలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారంలో ఆరోగ్యంగా సిద్ధిస్తుందని ప్రతి తల్లి గర్భవతులు బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని గర్భవతులు బాలింతలు పిల్లలకు ఆకుకూరల్లో పోషక విలువలు ఆహారపు అలవాట్లు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పెన్ పహాడ్ తాసిల్దార్ ధారావత్ లాలు నాయక్, మండల అభివృద్ధి అధికారి జన్జనాల వెంకటేశ్వరరావు, ఏపిఎం అజయ్ నాయక్, ఏపిఓ రవి, ఐసి.డి.ఎస్ సూపర్వైజర్ హనీషా, స్వప్న, చంద్రిక, బ్లాక్ కోఆర్డినేటర్ కె.ఝాన్సీ, అంగన్వాడి టీచర్లు భాస్కరమ్మ, లక్ష్మి, జయమ్మ, ఉరిమల, మంగ, దుర్గ, గ్రామాల అంగన్వాడి టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# భారీగా అక్రమ ఇసుక డంపులు స్వాధీనం

### – ఇసుక అక్రమ రవాణా చేసే కఠిన చర్యలు : తహసీల్దార్ అనిత

రాజాపేట, మేజర్‌న్యూస్ : అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 300 ట్రాక్టర్ల ఐదు ఇసుక డంపులను రాజాపేటలో గురువారం తహసీల్దార్ అనిత సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలోని మణికంఠ రైస్ మిల్‌లో, పక్కనే ఎలాంటి అనుమతి లేకుండా భారీగా ఇసుక డంపులు ఉన్నాయని తెలిపారు. ఇసుక డంపులను పరిశీలించి ఎలాంటి అనుమతి లేకపోవడంతో సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. నిబంధనల మేరకే ఇసుక కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక రవాణా చేసిన వారిని గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఆర్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మాజీ సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ తేజస్వి ఘనత

## తల్లి, కూతురుకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్

మర్రిగూడ, మేజర్‌న్యూస్ : టాలెంట్ ఎక్కడున్నా కాస్త సమయం తీసుకున్న వెలుగులోకి వస్తుంది. ఒక సెంట్రల్ బ్యాంక్ మేనేజర్‌గా తన విధులు నిర్వహిస్తూనే సంగీతం మీద మక్కువను పెంచుకున్నారు. ఆ అధికారి. ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూ తనలోని దాగి ఉన్న ప్రత్యేక కళకు పదును పెట్టారు. వివరాల్లోకి వెళితే మర్రిగూడ మాజీ సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ విధులు నిర్వర్తించిన సిరియాల తేజస్వి, ఆమె కూతురు జోయన ఇద్దరూ కలిసి కీబోర్డుపై స్వరాల ప్లే లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లో చోటు దక్కించుకున్నారు. విజయవాడ హాలేలుయ మ్యూజికల్ స్కూల్ ఆధ్వర్యం లో ఒక గంట నిడివి సమయంలో దాదాపు 1046 మంది ఒకే సమయం లో ఇంస్టాగ్రామ్ లోని సంగీతంలో ఎలక్ట్రానిక్ పియానో (కీబోర్డు) ద్వారా కొన్ని పాటలు ప్లే చేయడం జరిగింది. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ వారి లిస్టులో ఈ కార్యక్రమం నమోదయింది. ఈ మేరకు ఏప్రిల్ 14న హైదరాబాద్ హాలేలుయ మ్యూజికల్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్టీన్ దండింగి ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ బ్యాంక్ మేనేజర్ తేజస్వి తన కూతురుతో గిన్నిస్ బుక్ రికార్డు అందుకోవడం విశేషం. అనంతరం మేనేజర్ తేజస్వి మాట్లాడుతూ తన కూతురుతో పోటీ పడి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించడం తనకు ఎంతో గర్వంగా ఉందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాదులోని మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్ రెండవ తరగతి చదవడం పలువురుని ఆశ్చర్యానికి గురిచేసింది. అతి చిన్న వయసులో జోయాన అవార్డు సాధించడం పట్ల తల్లిగా తేజస్వికి ఆనందానికి అవధులు లేవంటే నమ్మడం అతిశయోక్తి కాదు. తల్లి కూతుర్లు అవార్డు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.




# కాంగ్రెస్ అగ్రనేతుల పై బిజెపి కక్ష సాధింపు చర్య

## - ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి




భువనగిరి, మేజర్‌న్యూస్ : బీజేపీ నరేంద్ర మోడీ రాజకీయ కక్ష సాధింపు ధోరణితో నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఛార్జ్ షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటి సియం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, పిట్టల బాలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వనజీవి రామయ్య మృతికి సంతాపం

చిట్యాల, మేజర్‌న్యూస్ : పద్మశ్రీ అవార్డు గ్రహీత వన జీవి రామయ్య ఇటీవల మృతి చెందగా గురువారం ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి పట్టణములోని ఆయన స్వగృహంలో కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమ్మరి సంఘం నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడూరి చంద్రం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః అనే నినాదంతో కోటి మొక్కలు నాటిన మహనీయుడని అన్నారు.

# భూదానోద్యమానికి నేటికీ 74 ఏండ్లు


- భూదానోద్యమానికి నాంది పలికిన పోచంపల్లి - భూదానోద్యమానికి బీజం వేసిన ఆచార్య వినోబాభావే
- ప్రథమ భూధాత వెదిరే రామచంద్రారెడ్డి 100 ఎకరాలతో ప్రారంభం - 44 లక్షల ఎకరాల భూమి పంపిణీ
- నేడు పోచంపల్లిలో భూదాన జయంతి వజ్రోత్సవాలు



రూరల్ టూరిజం పార్కులో ఆచార్య వినోబాభావే, వెదిరే రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలు



భూదానోద్యమ స్థూపం



ఆచార్య వినోబాభావేతో సమావేశమైన వెదిరే రామచంద్రారెడ్డి



గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : ఆనాడు ఆచార్య వినోబా భావే చెప్పిన మాట మహెూద్యమానికి దారితీసింది. దానికి పోచంపల్లి వేదికై నేడు దేశంలోనే కలికితురాయిగా మిగిలింది. వంద ఎకరాల భూమి దానంతో మొదలైన భూదాన్ ఉద్యమం లక్షల ఎకరాల వరకు సాగింది. ఈ భూదానోద్యమానికి వెదిరె రామచంద్రారెడ్డి ముందడుగు వేస్తే... ఈ నడకకు లయ నేర్పి పలువురికి మేలు చేసేలా చేసింది ఆచార్య వినోబా భావే. భూదానోద్యమం ప్రారంభం అయి నేటికీ 74 ఏండ్లు పూర్తి.

***భూదానోద్యమానికి బీజం పడ్డది ఇక్కడే...***

గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలు ప్రచారం చేయడంకోసం ఆచార్య వినోబా భావే... పౌనర్ ఆశ్రమం వీడి దేశమంతటా పాదయాత్ర చేయటానికి సిద్ధమయ్యారు. ఆ సమయంలోనే నల్గొండ జిల్లాలో జరుగుతున్న దోపిడీలు, కల్లోల పరిస్థితులు తెలుసుకొని పరిష్కార మార్గాన్ని అన్వేషించడానికి పాదయాత్రగా బయలుదేరి... 1951 ఏప్రిల్ 17న ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లికి చేరుకున్నారు. సాయంత్రం హరిజన వాడల్లో తిరిగారు. మరుసటి రోజు ఏప్రిల్ 18న గ్రామంలోని జువ్వి చెట్టు కింద గ్రామస్థులతో సమావేశమయ్యారు. మీ సమస్య ఏమిటని ప్రశ్నిస్తే... తమకు కొంత భూమి ఇస్తే సాగు చేసుకొని జీవిస్తామని గ్రామంలోని దళితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వినోబా భావే అందుకు స్పందిస్తూ మీలో ఎవరైనా భూమి దానం చేసేవారు ఉన్నారా అని ప్రశ్నించారు. అక్కడ జనసందోహంలో ఉన్న వెదిరె రామచంద్రారెడ్డి వెంటనే లేచి తన తండ్రి జ్ఞాపకార్థం 100 ఎకరాల భూమి దానం చేస్తానని ప్రకటించి... పత్రం రాసి వినోబా భావేకు అందజేశారు. నిండు సభలో దానరుపకంగా లభించిన ఆ భూమిని వినోబా భావే పేదలకు పంచి భూదానోద్యమానికి బీజం వేశారు. ఈ సందర్భంగా ప్రథమ భూధాతగా వెదిరే రామచంద్రారెడ్డి భూదానోద్యమానికి నాంది పలికారు. దీనికి గుర్తుగా సభ జరిగిన ప్రాంతంలోని జువ్వి చెట్టు ను గ్రామస్థులు ఇప్పటికి కాపాడుతూ... అక్కడ వినోబా భావే, వెదిరె రామచంద్రారెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేశారు. భూదానోద్యమనికి గుర్తుగా స్థూపాన్ని నిర్మించారు.

***44 లక్షల ఎకరాల భూమి పంపిణీ...***

వినోబా భావే పోచంపల్లికి వచ్చేవరకు భూదానోద్యమంపై ఆలోచన రాలేదు. ఏప్రిల్ 18న యాదృచ్ఛికంగా జరిగిన కార్యక్రమం భూదానోద్యమంగా రూపుదిద్దుకుంది. ఈ ఉద్యమం వేలాది మంది కార్యకర్తలను ఆకర్షించింది. వినోబా భావే దేశవ్యాప్తంగా దాదాపు 80 వేల కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి 1970 వరకు 44 లక్షల ఎకరాల భూమిని సేకరించారు. ఆ భూమిని నిరుపేదలకు అక్కడికక్కడే పంపణీ చేశారు. ఇలా భూదానోద్యమానికి నాంది పలికిన గాజులపోచంపల్లి... భూదాన్ పోచంపల్లిగా మారింది.

***నేడు భూదాన జయంతి వజ్రోత్సవాలు ప్రారంభం***

నేడు అంతర్జాతీయ స్థాయిలో కీర్తి గడించిన భూదానోద్యమం వజ్రోత్సవాలను నేడు భూదాన్‌పోచంపల్లి పురపాలక కేంద్రం లోని వినోబా మందిరంలో ప్రారంభించనున్నట్లు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్, వినోబానగర్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి గురువారము తెలిపారు. భూదాన జయంతి వజ్రోత్సవాలు నేటితో మొదలుకొని ఏప్రిల్ 18, 2026 వరకు నిర్వహించనున్నట్లు, భూదాన జయంతి అవార్డుల ప్రధానోత్సవం, 'సర్వోదయం-భూదాన ఉద్యమం 'పుస్తకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.